క్లుప్తంగా

శాకంబరీదేవిగా పైడితల్లి



శాకంబరీదేవి అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, శంబరి కృష్ణ, తదితరులు కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రమీలాదేవి

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల గురుకులంలో విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలాదేవి ఆధ్వర్యంలో 373 మందికి పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు దృష్ట్యా వసతిగృహంలో వేడినీటి సదుపాయంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది బంగారుబాబు, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి

భోగాపురం: ప్రభుత్వం వివిధ బ్యాంకుల సహాయంతో రాయితీపై అందిస్తున్న రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన బ్యాంకర్లు, ఏపీఎంలు, సచివాలయాల సిబ్బందితో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక, రైతుశక్తి పేరిట ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ఈ రుణాలు ఎలా పొందాలి అన్న విషయాలపై రైతులు, డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డెంకాడ ఎంపీడీఓ లవరాజు, ఈఓపీఆర్‌డీ సురేష్, ఎల్‌డీఎం నాగార్జున, ఏసీ రాజ్‌కుమార్, మూడు మండలాలకు చెందిన ఏఓలు, ఏపీఎంలు, సీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



నగరంలోని ఓ డివిజన్‌లో ఫాగింగ్

విజయనగరం: నగరంలో దోమల నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి నియంత్రణ చర్యలు ఇప్పటికే ముమ్మరం చేశామని, అలాగే ఫాగింగ్ యంత్రాలతో అన్ని డివిజన్‌లలో ఫాగింగ్ చేపడుతున్నామన్నారు. రోజుకొక డివిజన్ చొప్పున ఇప్పటివరకు నాలుగు డివిజన్‌లలో ఫాగింగ్ పూర్తయిందని తెలిపారు. 20 లీటర్ల డీజిల్‌లో లీటర్ టిక్ మలాథియాన్ గాని పైరాత్రం గాని కలిపి పిచికారీ చేస్తున్నామని చెప్పారు. సెప్టిక్ ట్యాంకులకు నెట్‌లను అమర్చామన్నారు. గంబూషియా చేపపిల్లలను తెప్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. త్వరలోనే చేప పిల్లలు వచ్చిన వెంటనే వాటిని చెరువులలో వదిలే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగ లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఇదేమి చోద్యం..!

- దన్నానపేటలో రాజకీయ కక్ష సాధింపులు
- సామాన్యులపై ఏకంగా టీడీపీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు
- రంగంలోకి దిగిన ఆర్డీఓ, ఆక్రమణలు తొలగించాలంటూ ఆదేశం
- టీడీపీ నాయకుల ఆక్రమణలను పట్టించుకోని యంత్రాంగం
- అధికారుల ఏకపక్ష ధోరణిపై మండిపడుతున్న బాధితులు



దన్నానపేటలో సర్వే నంబర్ 40లో టీడీపీ నాయకులు ఆక్రమించుకున్న సుమారు రెండున్నర ఎకరాల కొండపోరంబోకు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట గ్రామంలో రాజకీయ కక్ష సాధింపులు ప్రారంభమయ్యాయి. ఆ గ్రామానికి చెందిన టీడీపీ మండల నేత సామాన్యులను వేధింపులకు గురిచేయడాన్ని పలువురు రాజకీయాలకతీతంగా ఖండిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు చూడలేదంటూ గ్రామస్తులే మండిపడుతున్నారు. అధికారుల కూడా ఏకపక్షంగా వ్యవహరించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే....దన్నానపేటలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన పతివాడ పైడిశెట్టి అనే వ్యక్తి రెండేళ్ల కిందట నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. సుమారు రెండు సెంట్ల విస్తీర్ణంలో కాంపౌండ్ హాల్ ప్రభుత్వ స్థలంలో ఉందంటూ సదరు టీడీపీ నేత ఏకంగా అమరావతి వెళ్లి టీడీపీ నాయకులు, కార్యకర్తల కోసం పెట్టిన గ్రీవెన్స్‌సెల్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. పైనుంచి ఆదేశాలు రావడంతో ఆర్డీఓ సూర్యకళ గురువారం గ్రామంలో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. రికార్డులను సరిచూసి తొలగించాలంటూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

టీడీపీ నేతల ఆక్రమణల పరిస్థితేమిటి...?

తప్పు ఎవరు చేసినా తప్పే అవుతుంది..ప్రభుత్వ భూములు కాని, దేవస్థాన భూములు కాని... ఎవరు ఆక్రమించినా శిక్షార్హులే. ఎవరూ కాదనలేరు కూడా. అయితే ఓ టీడీపీ నేత అనధికారకంగా ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన అధికారులు.. మరి టీడీపీ నేతల ఆక్రమణలపై స్పందించకపోవడం బాధాకరమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే గ్రామంలో ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు ఆక్రమించి, ఇళ్లు నిర్మించుకున్నారంటూ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు లిఖితపూర్వకంగా అధికారులకు పిర్యాధులు చేస్తే, అధికారుల నుంచి నేటికీ కూడా స్పందన లేదు. ప్రస్తుతం మాత్రం ఆగమేఘాలపై స్పందించారని గుర్తు చేసుకుంటున్నారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదంటూ విమర్శిస్తున్నారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరులు కూడా ప్రభుత్వ భూములను ఆక్రమించారని వాటిని తొలగిస్తే...తాము కూడా తొలగిస్తామంటూ వైఎస్సార్ సీపీ నేతలు పట్టుబడుతున్నారు.

టీడీపీ నేతల ఆక్రమణలపై గతంలోనే ఫిర్యాదు..

గతంలో దన్నానపేటలో టీడీపీ నాయకులు, పార్టీ సానుభూతిపరుల భూ ఆక్రమణలపై స్థానికులు అన్ని ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 49-20లో రస్తాను ఆక్రమించి మామిడి తోట వేశారని, సర్వే నంబర్ 68లో సున్నపువాని చెరువును ఆక్రమించి మామిడి, టేకు మొక్కలు వేశారని, సర్వే నెంబర్ 60-1లో తుర్లవాని బందను ఆక్రమించి బోర్ వేశారని, సర్వే నంబర్ 40లో సుమారు రెండున్నర ఎకరాల కొండ పోరంబోకును ఆక్రమించి శాలలు వేశారని, సర్వే నంబర్ 51-1లో కొబ్బరిబందను ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని, సర్వే నంబర్ 66-1లో రస్తా ఆక్రమణ, తదితర ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదులు అందినా, నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వీటిని కూడా తొలగించాలని ఆ గ్రామ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం...



నిబంధనలు ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగిస్తాం. పార్టీలతో మాకు సంబంధం లేదు. ఆక్రమణలకు ఎవరు పాల్పడినా ప్రభుత్వం దృష్టిలో తప్పే. ఇరువర్గాల ఆక్రమణలు పరిశీలించి రికార్డులను సరి చూస్తాం. ఆక్రమణలని తేలినట్లైతే అన్నింటినీ తొలగిస్తాం.

ధర్మరాజు, తహసీల్దార్, నెల్లిమర్ల మండలం

ఇది న్యాయమేనా...?



నేను ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాలు పక్కన పెడితే అందరికీ సమన్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉంది. అలా చేయలేని పక్షంలో ధర్మం తప్పినట్లే అవుతుంది. కాంపౌండ్ హాల్ ఆక్రమణలో ఉందని చెప్పి ఇప్పుడు తొలగిస్తామంటున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను నేను ఎప్పుడూ సమర్థించను. మరి టీడీపీ నాయకులు ఆక్రమించిన వాటి జోలికి ఎందుకు పోవడం లేదు. అందరికీ ఒకే న్యాయం ఉండాలి. అధికారులు రికార్డులను పరిశీలించి పార్టీలకతీతంగా అందరి ఆక్రమణలు తొలగించాలి. అవసరమైతే న్యాయ పోరాటం కూడా చేస్తాం.

గేదెల రామచిరంజీవి, సర్పంచ్, దన్నానపేట గ్రామం

సైనికుల త్యాగాలు మరువలేనివి



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో మాజీ ఆర్మీ జవాన్ లక్ష్మణదాసును సత్కరిస్తున్న వీసీ పీకే మహంతి, తదితరులు

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి

నెల్లిమర్ల రూరల్: దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగావాయన మాట్లాడుతూ.. సైనికులు సరిహద్దుల్లో గస్తీ కాయడం వల్ల మనమంతా ప్రశాంతంగా ఉంటున్నామన్నారు. సైనికుల వలే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. వాఘా బోర్డర్, కార్గిల్ స్థలాలను విద్యార్థులు సందర్శించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఆర్మీ జవాన్ లక్ష్మణదాసును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, పీఎస్వీ రమణారావు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు సతీష్, ఆర్ఎస్ వర్మ, సన్నీడయోల్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

వారి త్యాగాలు అజరామరం..

విజయనగరం పూల్‌బాగ్: దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న జవాన్ల త్యాగాలు అజరామరని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి నేటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విశ్రాంత హవల్దార్ ఉంగ ఆది నారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, పాకిస్థాన్ దురహంకారాన్ని భారత్ సైనికులు తుదముట్టించారన్నారు. అమరవీరుల త్యాగాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, సమన్విత ఏజెన్సీస్ అధినేత గోలుగూరి నాగిరెడ్డి, ఇప్పలవలస గోపి, జాగరపు ఈశ్వరప్రసాద్, అల్లంశెట్టి నాగభూషణం, జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్, ధాత్రాజు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడికి దూరం

- రెడ్‌క్రాస్ ఛైర్మన్ ప్రసాదరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: యోగా చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చునని రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహకారం, ద్వేషాన్ని ప్రతి ఒక్కరూ విడనాడాలన్నారు. వలంటీర్లు సేవాదృక్పథంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో యోగా మెడిటేషన్ ట్రైనర్ కె. వెంకటరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం, ట్రెజరర్ టి. రామారావు, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

- డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు



జొన్నాడలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు

డెంకాడ: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు వివిధ రకాల రోగాలకు దూరంగా ఉండవచ్చని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నాడలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో తిరిరి పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, వీటితో పలు రకాల వ్యాధులు ప్రబలుతాయన్నారు. కొబ్బరి చిప్పలు, వాడి పడేసిన టీ కప్పులు, పాత టైర్లలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపింపజేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భోగాపురం: మండలంలోని ముక్కాం, భోగాపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం రూరల్ విద్యుత్‌శాఖ ఈఈ జి. సురేష్ బాబు శుక్రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన రాయపురెడ్డి సురేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. నిందితుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికను మే 21వ తేదీన కిడ్నాప్ చేసినట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్సై సూర్యకుమారి, సిబ్బంది అక్కడకు వెళ్లి యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై డీఎస్పీ గోవిందరావు శుక్రవారం ముంజేరు గ్రామానికి వెళ్లి విచారణ చేశారు.

పది గంటల్లోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

- కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 10 గంటలకల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు వెల్ఫేర్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీకి సంబంధించిన విధివిధానాలను వివరించారు. గత నెలలో కార్పొరేషన్ పరిధిలో 99.3% పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. మొత్తం 23,305 మంది పింఛన్‌దారులుండగా.. వీరిలో 110 మంది మరణించగా మరో 117 మంది అందుబాటులో లేకపోవడంతో 99.3% మందికి పింఛన్లు అందజేసినట్లు చెప్పారు. అలాగే జూలై 1వ తేదీన 95%.. 2వ తేదీన మిగిలిన 4.3 శాతం మందికి పింఛన్లు అందజేశామన్నారు. అయితే రానున్న ఒకటో తేదీ ఉదయం పది గంటల్లోపు శత శాతం పింఛన్ల పంపిణీ జరగాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ ప్రతినిధులు హేమసుందర్, స్వామినాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో రైతులకు కశాయాల తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో వరి, కూరగాయల పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకుండా ఉండాలంటే వెల్లుల్లి, పచ్చిమిర్చి, పొగాకు కాడలు, 20 లీటర్ల ఆవు మూత్రం ఒక డ్రమ్ములో వేసి 45 రోజులు నిల్వ ఉంచిన తర్వాత పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి ప్రతినిధులు కర్రోతు లక్ష్మి, అంబళ్ల రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతితభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ పక్కన నిర్వహిస్తున్న దివ్యాంగ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ శాఖ ఏడీ జీవీబీ జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 39 ఖాళీలు ఉన్నాయన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఆపై చదువులు చదువుతున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వసతి గృహంలో ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్ చార్జీలు, సంవత్సరానికి 4 జతలు యూనిఫారాలు, నోట్ బుక్స్, ఇతర సదుపాయాలు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వీరికి వసతి గృహం దగ్గరలో గల పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. వివరాల కోసం సెల్: 91006 85216 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా పన్నుల వసూళ్లు

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

విజయనగరం: ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సచివాలయాల వారీగా పన్ను వసూళ్లను ముమ్మరం చేసి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. కుళాయి పన్నుల వసూళ్లలో కొంతమంది కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారందరూ పనితీరు మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఈ కె. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 128 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో విజయనగరం వీటీ అగ్రహారం బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కేఎల్‌గ్రూప్ ఎస్‌కే సేఫ్టీవింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (అమెజాన్) కంపెనీలో వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 319 మంది జాబ్‌మేళాకు హాజరుకాగా, తుదిదశ 128 మందిని ఎంపిక చేసినట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, హెచ్ఆర్ వి.బాబాజీ, యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్‌బాబు, ఉపాధి కార్యాలయం, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వరినారుతో

అధిక దిగుబడులు

- నారు పెంపకంలో రైతులు బిజీబిజీ
- నీటివసతి ఉన్న చోట ఊబాలకు సిద్ధపడుతున్న రైతులు



పూసపాటిరేగ : ఖరీఫ్ సీజన్ వరిసాగులో రైతులు బిజీబిజీగా ఉన్నారు. బోరుబావులు, నీటివసతి ఉన్న రైతులు నాట్లు (ఊబాలు) వేసేందుకు సిద్ధపడుతున్నారు. వరి సాగులో మెలకువలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా వరి నారు పెంపకం, నాట్లు విషయంలో రైతులు మెలకువలు పాటించాలి. వాతావరణ పరిస్థితులకు అనువైన వరి రకాలను ఎంపిక చేసుకోవాలి. తక్కువ నత్రజని ఉపయోగించుకుని ఎక్కువ దిగుబడులు ఇచ్చే స్వర్ణ, 1221 రకాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పొలాన్ని దమ్ము చేసుకోవాలి ..

వరి నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేసుకోవాలి. పొలమంతా నీరు అవలీలగా తిరిగే విధంగా చెక్కతో చదును చేసుకోవాలి. నల్లరేగడి నేలలో అయితే నాట్లు వేయడానికి రెండు రోజుల ముందు పొలాన్ని దమ్ము చేసుకోవాలి.

నాట్లు వేయడంలో మెలకువలు..

నాట్లు వేయడానికి మడి నుంచి నారును తీసేటప్పుడు లేతాకు పచ్చగా ఉంటేనే మొన తొందరగా తిరబడుతోంది. నాటడానికి 4- 6 ఆకులు ఉన్న నారును మాత్రమే ఉపయోగించాలి. ముదురు ఆకులు ఉన్న నారును నాటితే దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో నారును పైపైన నాటితే పిలకలు ఎక్కువ వేసే అవకాశం ఉంటుంది. భూసారాన్ని అనుసరించి చదరపు మీటరులో 33 మొనలు ఉండే విధంగా నాట్లు వేసుకోవాలి. నాటు మధ్యలో ప్రతి రెండు మీటర్ల ఎడంలో 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదులు కోవాలి. బాటలు తీయడంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపులో ఉంటుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీ, కలుపు మందులు వేయడానికి బాటలుగా ఉపయోగపడతాయి.

జింక్ లోపాన్ని గమనించాలి..



నారులో జింక్ లోపాన్ని గుర్తిస్తే లీటర్ నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తనం చల్లిన పది రోజుల కోసారి, 17 రోజులకు రెండోసారి లీటర్ నీటిలో 1.6 ఎం.ఎల్ మోనోక్రోటోపాస్ కలిపి పిచికారీ చేయాలి. నారు ఒక ఆకు పూర్తిగా పురి విచ్చుకొనే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత నీరు పలుచగా అందించాలి.

– కొల్లి నీలిమ , పూసపాటిరేగ మండల వ్యవసాయ అధికారి

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి దీపారాధన సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తర్వాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం ఆరు గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, రామ్‌గోపాల్, భక్తులు పాల్గొన్నారు.